క్లుప్తంగా

ముగిసిన పంచదశ వార్షికోత్సవం


అగ్నిగుండాల కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల ఓంకారేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా పంచదశ వార్షికోత్సవాలు నిర్వహించారు. ఈ వార్షికోత్సవాలు సోమవారంతో ముగిసాయి. చివరి రోజున ఆలయ ప్రాగణంలో అగ్ని గుండాల కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అగ్ని గుండాల్లో నడిచి భక్తిని చాటుకున్నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాధవరెడ్డి, పూజారులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి


భక్తి గీతాలు ఆలపిస్తున్న చతుర్వేది అఖిల్, భానుప్రసాద్ బృందం

మీర్‌పేట: భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆదివారం రాత్రి మీర్‌పేట శివసాయినగర్ కాలనీలోని గౌరి నీలకంతేశ్వరస్వామి ఆలయంలో మృదంగం మాస్టర్స్ చతుర్వేది అఖిల్, భానుప్రసాద్‌లు నిర్వహించిన మృదంగం–భక్తి సంగీత విభావరి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పలువురు భక్తులు భక్తి గీతాలు ఆలపించగా చతుర్వేదుల అఖిల్ మృదంగం అద్భుతంగా ప్రదర్శించారు. టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ధర్మాచార్య జనార్దనరావు, వేముల రాజేశ్వర రావు, కే.ఎస్.మూర్తి, చింతామణి నాటక సుబ్బిశెట్టి పాత్రధారులు రోసిరెడ్డి, సీ.వీ.పద్మాకర్, పరమేశ్వరిలు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజయ్యారు.

ఘనంగా శోభాయాత్ర


శోభాయాత్రలో వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, సర్పంచ్ నర్సింహారెడ్డి తదితరులు

ఆమనగల్లు: మండల పరిధిలోని మంగళపల్లి గ్రామంలో సోమవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. హనుమాన్ ఆలయం నుంచి మంగళపల్లి గ్రామంలోని అన్ని కాలనీల్లో ఈ యాత్ర కొనసాగింది. అనంతరం శివాజీ విగ్రహానికి పూలమాల వేసి పలువురు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, సర్పంచ్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రాధాన్యత

జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ


ఉత్తర్వులు అందజేస్తున్న అనురాధ

ఆమనగల్లు: గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యురాలు నేనావత్ అనురాధ చెప్పారు. మండల పరిధిలోని మేడిగడ్డతండాకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.3లక్షల జెడ్పీ నిధులు అందాయి. ఈ మేరకు ఆమె సోమవారం సర్పంచ్ అమర్‌సింగ్‌కు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. మండల పరిధిలోని గ్రామాల్లో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుని నిధులు మంజూరు చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దోనాదుల కుమార్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ నారాయణ, నాయకులు రవీందర్‌నాయక్, శంకర్‌నాయక్, రాములు, లక్ష్మణ్, రమేశ్, వెంకటయ్య, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కంపెనీ మూసివేతకు దీక్ష


దీక్షలో కూర్చున్న కొత్తపల్లి గ్రామస్తులు

యాచారం: కొత్తపల్లి గ్రామంలో బొక్కల కంపెనీని మూసేయాలని గ్రామస్తులు చేపట్టిన దీక్ష సోమవారం 19వ రోజుకు చేరింది. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఆందోళనకు మద్దతు తెలిపినా నేటికీ స్పష్టత రాకపోవడంతో ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది. అధికారులు స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుండాలు హెచ్చరించారు.

అంధత్వ రహిత తెలంగాణకే 'కంటి వెలుగు'

మేయర్ పారిజాత


బడంగ్‌పేట్: కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ దీపిక


బడంగ్‌పేట్: శివనారాయణపురం కాలనీలో కంటి వెలుగును ప్రారంభిస్తున్న మేయర్


కందుకూరు: సార్లరావులపల్లిలో కంటి అద్దాలు అందజేస్తున్న సర్పంచ్

బడంగ్‌పేట్: అంధత్వరహిత తెలంగాణ ఏర్పాటుకే ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత అన్నారు. సోమవారం ఆమె కార్పొరేషన్ పరిధిలోని 22వ డివిజన్ శివనారాయణపురం సంక్షేమ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని కార్పొరేటర్ లిక్కి మమతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పి.దర్శన్‌రెడ్డి, రాళ్లగూడెం శ్రీనివాస్‌రెడ్డి, ఎల్.కృష్ణారెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కృష్ణ, అశోక్‌కుమార్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

వినాయకహిల్స్ కాలనీలో..

అల్మాస్‌గూడలోని వినాయకహిల్స్ కాలనీలోని దాసాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని 5వ డివిజన్ కార్పొరేటర్ బోయపల్లి దీపిక పాల్గొని ప్రారంభించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బి.శేఖర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఉన్నారు.

ప్రజలు వినియోగించుకోవాలి

కందుకూరు: కంటి వెలుగు పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సార్లరావులపల్లి సర్పంచ్ రజితప్రవీణ్‌నాయక్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని సార్లరావులపల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. గ్రామాలు, తండాల్లోకే వచ్చి వైద్యులు కంటి పరీక్షలు చేయడం శుభ పరిణామమన్నారు. ఇదంతా సీఎం కేసీఆర్ సువర్ణ పాలనకు నిదర్శనమన్నారు. కంటి పరీక్షల ద్వారా ప్రారంభంలోనే సమస్యలను గుర్తించి సత్వరమే చికిత్సలు అందించడానికి సులభమవుతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కవితశ్రీరామ్, నాయకుడు ప్రవీణ్‌నాయక్, వైద్యులు డాక్టర్ సాయి సౌమ్య, సీహెచ్ఓ కె.రవీందర్, సూపర్‌వైజర్ జి.లక్ష్మమ్మ, ఎంపీహెచ్ఏఎఫ్‌లు సైదులు, ప్రేమలత, బస్సమ్మ, పంచాయతీ కార్యదర్శి శివప్రశాంత్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

అబ్దుల్లాపూర్‌మెట్: పంచాయతీ కార్మికుల ఉద్యోగాల క్రమబద్ధీకరణ చేపట్టి వేతనాలు పెంచాలని వారు పాదయాత్ర చేపట్టారు. ఈ నెల 12న పాలకుర్తి నుంచి ప్రారంభమైన పాదయాత్ర బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి ప్రవేశించనుంది. సోమవారం సీఐటీయూ మండల కార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ.. బుధవారం అనాజ్‌పూర్‌లో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు అంజయ్య, చంద్రయ్య, సుధాకర్, మల్లమ్మ, సంపూర్ణ, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

లీగల్ సెల్ కో కన్వీనర్‌గా విజయనాయక్

యాచారం: బీజేపీ అర్బన్ జిల్లా లీగల్ సెల్ కో కన్వీనర్‌గా తక్కళ్లపల్లి తండాకు చెందిన మాజీ ఉప సర్పంచ్ జర్పుల విజయనాయక్ నియమితులయ్యారు. జిల్లా కన్వీనర్ ప్రదీప్‌కుమార్, రాష్ట్ర జాయింట్ కో కన్వీనర్ రామారావు ఈ మేరకు సోమవారం ఉత్వర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా విజయనాయక్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ సభ్యుడు బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

యాదగిరి కుటుంబానికి అండగా ఉంటాం


చిన్నారులను ఓదారుస్తున్న మంత్రి సబితారెడ్డి

మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ 35వ డివిజన్ లెనిన్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త దండుగుల యాదగిరి మృతి చెందిన విషయం తెలుసుకున్న విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి సోమవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. యాదగిరి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని మంత్రి భరోసానిచ్చారు. పరామర్శించిన వారిలో మేయర్ ఎం.దుర్గదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, స్థానిక కార్పొరేటర్ సౌందర్యవిజయ్, నాయకులు దిండు భూపేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

పహాడీషరీఫ్: నిరుపేదల పాలిట సీఎం సహాయ నిధి ఆపన్నహస్తంగా మారిందని జల్‌పల్లి మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ కెంచె లక్ష్మీనారాయణ అన్నారు. వార్డు పరిధిలో అనారోగ్యానికి గురైన ఆంజనేయులుకు సీఎంఆర్ఎఫ్‌కు లక్ష్మీనారాయణ దరఖాస్తు చేసి...మంత్రి సబితా ఇంద్రారెడ్డికి ప్రతిపాదన పంపారు. మంత్రి సిఫారసు మేరకు మంజూరైన రూ.52,500ల చెక్కును సోమవారం బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు మంత్రితో పాటు కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎలక్ట్రికల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరిస్తా

ఎమ్మెల్యే రఘునందన్‌రావు


మేయర్ పారిజాతను సన్మానిస్తున్న ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్

బడంగ్‌పేట్: ప్రైవేట్ ఎలక్ట్రీకల్ వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు హామీ ఇచ్చారు. సోమవారం బడంగ్‌పేటలోని జీఎంఆర్ గార్డెన్‌లో తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రఘునందన్‌రావు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత, బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను వారి ఆలోచనలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. టెక్నీషియన్స్ సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. మేయర్ పారిజాత మాట్లాడుతూ..కార్మిక సమస్యలపై ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదని మండిపడ్డారు. ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్యాలయ భవన నిర్మాణానికి వేయి గజాల స్థలం కేటాయించాలని, భవన నిర్మాణానికి నిధుల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికుల కోసం ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం కల్పించాలని, ప్రమాదంలో మరణించిన వారికి రూ.15లక్షలు అందించాలని సంఘం నిర్వాహకులు డిమాండ్ చేయగా వాటి అమలు కోసం మేము కూడా పోరాడుతామని సమావేశానికి హాజరైన వారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకన్నగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లేశ్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు సామల శ్రీకాంత్‌రెడ్డి, బెనర్జి, నిరంజన్, ఉదయ్‌కుమార్, పాషా, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టా భూములు కోల్పోకుండా వంతెన నిర్మించండి

జీఎస్పీ మున్సిపల్ అధ్యక్షుడు ప్రహ్లాద్

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో చాకిరేవు, చాకలి వాగులపై నూతనంగా నిర్మిస్తున్న వంతెనల కారణంగా పక్కనే ఉన్న దళితులకు చెందిన పట్టా భూములకు నష్టం వాటిల్లనుందని పెద్దఅంబర్‌పేట బీఎస్పీ అధ్యక్షుడు యంజాల ప్రహ్లాద్ ఆర్అండ్‌బీ అధికారులకు వివరించారు. వంతెన నిర్మాణం చేస్తున్న ప్రణాళికను మరోసారి పరిశీలించి పట్టా భూములను కోల్పోకుండా చూడాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఆర్అండ్‌బీ డీఈ వేణుగోపాల్‌రెడ్డి సోమవారం వంతెన నిర్మించనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రభుత్వ భూమి నుంచి వంతెన నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని డీఈ హామీ ఇచ్చారని ప్రహ్లాద్ చెప్పారు.

ఘనంగా సేవాలాల్ జయంత్యుత్సవం

మంచాల: మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ నర్మద సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సేవాలాల్ మహరాజ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన నాయకులు, గిరిజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తారకరత్నకు నివాళి

ఇబ్రహీంపట్నం రూరల్: నందమూరి తారకరత్నకు టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డొంకని కిషోర్‌గౌడ్ నివాళి అర్పించారు. జూబ్లీహిల్స్‌లోని ఫిల్మ్‌ంచాంబర్‌లో తారకరత్న మృతదేహానికి పూలమాల వేసి సంతాపం వ్యక్తం చేశారు.

రాకేశ్‌భవానికి సామాజిక సేవా పురస్కారం

హయత్‌నగర్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని హయత్‌నగర్ డిగ్రీ కళాశాల తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, రంగారెడ్డి జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి చింతల రాకేశ్‌భవానికి అస్తిత్వం సంస్థ సామాజిక సేవా పురస్కారాన్ని అందించింది. ఈ మేరకు నగరంలోని రవీంద్రభారతీలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సిటీ సివిల్ కోర్టు జడ్జి మురళీమోహన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా రాకేశ్‌భవాని మాట్లాడుతూ... ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా, కోవిడ్ సమయంలో కేంద్ర ప్రభుత్వ నోడల్ అధికారిగా, నెహ్రూ యువ కేంద్రం కమిటీ సలహా సభ్యుడిగా తన సేవలను గుర్తించిన అస్తిత్వం సంస్థ తనను ఈ అవార్డుకు ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అస్తిత్వం సంస్థ నిర్వాహకులు మంజులాకౌర్, సలహాదారు కృష్ణవేణి, హెల్త్ కౌన్సిలర్ హిప్నో పద్మాకమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా చర్యలు

మేయర్ దుర్గ


సమస్యలను తెలుసుకుంటున్న మేయర్ దుర్గ, కమిషనర్ నాగేశ్వర్

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ తెలిపారు. మీర్‌పేట కార్పొరేషన్ 43వ డివిజన్ కార్పొరేటర్ గజ్జెల రాంచందర్ వినతి మేరకు సోమవారం మేయర్ అధికారులతో కలిసి బస్తీలలో పర్యటించారు. ఈ మేరకు పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. బస్తీల్లో అపరిశుభ్రత నెలకొనకుండా ఎప్పటికప్పుడు చెత్తను తరలించడంతో పాటు ఫాగింగ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ఆర్కల భూపాల్‌రెడ్డి, కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్, డీఈ గోపీనాథ్, ఏఈ శ్రీనివాస్, శానిటరీ సూపర్‌వైజర్ దాసరి రంజిత్, నాయకులు బాలప్ప, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు


హనుమాన్ పూజలో పాల్గొన్న భక్తులు

మహేశ్వరం: మండల పరిధిలోని ఘట్టుపల్లి గ్రామంలో కొలువుదీరిన వీరాంజనేయ స్వామి ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. ఉదయం శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ అనితారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రాకేశ్‌రెడ్డి, ఆలయ ఈఓ శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీశైలం, ఆలయ డైరెక్టర్లు శ్రీశైలం, ఆలయ పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్య రక్షణ సమష్టి బాధ్యత


సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది

కడ్తాల్: చిన్నారుల ఆరోగ్యరక్షణ సమష్టి బాధ్యతని కడ్తాల సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ స్థాయి పర్యవేక్షణ, సహాయ కమిటీ ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరితో కలిసి అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు అందుతున్న సేవలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, నాయకులు మహేశ్, భిక్షపతి, మల్లయ్య, రాంచంద్రయ్య, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు ధనుంజయ్‌గౌడ్, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

పేదలకు పట్టాలివ్వండి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య



ఆర్డీఓ కార్యాలయం ముట్టడిలో పాల్గొన్న సీపీఐ నాయకులు

తుర్కయంజాల్: ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని, అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తుర్కయంజాల్‌లోని ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూములను కబ్జా చేసి అమ్ముకుంటున్నా పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు, పేదలు 60 గజాల స్థలం కోసం గుడిసెలు వేస్తే తొలగించి కేసులు నమోదు చేయడం సరి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇళ్ల స్థలాలు లేని వారికి పంపిణీ చేయాలని, లేని పక్షంలో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసే ప్రక్రియను కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం పదిలం

వాకర్స్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ జిల్లా గవర్నర్ చక్రపాణి


దిల్‌సుఖ్‌నగర్ వాకర్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేస్తున్న శ్రీనివాస్ తదితరులు

హుడాకాంప్లెక్స్: ఆనందమయ జీవితానికి, ఆరోగ్యానికి నడక ఎంతో మేలు చేస్తుందని.. ప్రతి ఒక్కరూ నడకను అలవాటు చేసుకోవాలని వాకర్స్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ జిల్లా గవర్నర్ చక్రపాణి అన్నారు. సోమవారం దిల్‌సుఖ్‌నగర్ వాకర్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం సరూర్‌నగర్ హుడాకాంప్లెక్స్‌లోని సీనియర్ సిటిజన్స్ భవన్‌లో నిర్వహించారు.లీ కార్యక్రమానికి చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దిల్‌సుఖ్‌నగర్ వాకర్స్ క్లబ్ 2023 సంవత్సర కాలం అధ్యక్షునిగా జగిని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా దాచాపల్లి శ్రీనివాస్, కోశాధికారిగా చోలేటి ఆనంద్‌లతో పాటు నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన క్లబ్ సభ్యులకు, జిల్లా బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, రామనాథం, నాగభూషణం, మాధవరావు, ప్రసాద్, మురళీకృష్ణ, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

లేఖనంలో ప్రతిభ చూపిన విద్యార్థులు


బహుమతులతో విద్యార్థులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని లార్డ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్ విద్యార్థులు లేఖన నైపుణ్యంలో ప్రతిభ కనపరిచారు. దేశ వ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన హ్యాండ్ రైటింగ్ పోటీల్లో పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొని సత్తాచాటారు. వెండి, రజత పతకాలు సాధించి పాఠశాలకు పేరు తెచ్చారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థి అభ్యసనంలో లేఖన నైపుణ్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందన్నారు. చేతి రాత ఎంత చక్కగా ఉంటుందో భవిష్యత్ రాత కూడా అంతే అందంగా ఉంటుందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనపరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, డైరెక్టర్ అనురాధ, ప్రిన్సిపాల్ ఆర్.సంతోశ్, ఇంఛార్జి రేఖ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణకు ప్రాధాన్యం

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


ఎల్‌బీనగర్‌లో రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, జోనల్ కమిషనర్

ఎల్‌బీనగర్: తెలంగాణ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రోడ్ల విస్తరణ, సుందరీకరణకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం జీహెచ్ఎంసీ, ఇతర శాఖ అధికారులతో కలసి నాగోలు-మందమల్లమ్మ చౌరస్తా వరకు చేపట్టనున్న విస్తరణ ప్రణాళికలో భాగంగా రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రజారవాణాను బలోపేతం చేసేందుకు, నగరంలో ట్రాఫిక్ సమస్య నివారణకు, రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్లను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎప్పటికప్పుడు నూతన ప్రణాళిక రూపొందించాల్సి ఉంటుందన్నారు. నాగోలు నుంచి మందమలమ్మ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణతోపాటు రోడ్లకు ఇరువైపులా ఫుట్ పాత్‌లు, సైక్లింగ్ ట్రాక్ నిర్మాణం, వాటి మధ్య అందమైన పూల మొక్కలను ఏర్పాటు చేసి సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలపారు. నగరంలో ఇప్పటికే ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు పూర్తయిన నేపథ్యంలో వాటికి అనుబంధంగా ఉన్న రోడ్లను పూర్తి స్థాయిలో అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోందన్నారు. అప్పటికే నగరంలో వాహనాలు ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతుందని అందుకే ప్రజలు తక్కువ దూరాలకు వాహనాలు వినియోగించకుండా నడక లేక సైకిళ్ల ద్వారా వెళ్లేందుకు వీలుగా రోడ్లను విస్తరణ చేపట్టినట్లు తెలిపారు. వచ్చే జూన్, జూలై నాటికి నాగోలు నుంచి మందమల్లమ్మ చౌరస్తా వరకు సుందరీకరణ పనులు పూర్తయి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. జోనల్ కమిషనర్ పంకజ, ఎస్ఈ అశోక్‌రెడ్డి, సిటీ ప్లానర్ ప్రసాద్‌రావు, ఈఈ రమేష్‌బాబు, హార్టికల్చర్ అధికారి రాజ్‌కుమార్, డీసీలు మారుతీదివాకర్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.